

నల్సా పథకంపై న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - కడప

డిఎల్ఎస్ఎ ఆధ్వర్యంలో కడప నగరంలోని అప్సర సర్కిల్, మాచుపల్లి బస్టాండ్ ఆటో స్టాండ్‌లో అసంఘటిత రంగ కార్మికులకు పథకం 2015 పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ శ్రమ కార్డుల గురించి, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి, వైయస్సార్ బీమా నమోదు, ఆయుష్మాన్ భారత్, పీఎం శ్వనిధి, మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సులో వివరించారు. పై అంశాల సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాస్, అధికారులు శ్రీనివాసరెడ్డి, పాల్ జాన్సన్, ఎన్జీవోలు సురేష్ సహాయం, జిలానిబాష, పారా లీగల్ వాలంటరీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇళ్లలో పనిచేసేవారు, వ్యవసాయ కూలీలు, సామాన్య వీధి వ్యాపారులు, హమాలీ దినసరి కూలీలు పాల్గొన్నారు.

నాన్న ఆశయాలే నడిపిస్తున్నాయ్..

వైఎస్ఆర్‌కు సిఎం జగన్ నివాళి

ప్రజాశక్తి - వేంపల్లె

నాన్న ఆశయాలే సంక్షేమం, సమగ్రాభివృద్ధి లక్ష్యాల సాధనలో నన్ను చేయిపట్టి నడిపిస్తున్నాయని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కడప జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఘననివాళులర్పించారు. తాడేపల్లి నుండి ప్రత్యేక విమానంలో కడప ఎయిర్ పోర్టుకు చేరుకున్న సిఎం సతీమణి భారతితో కలిసి హెలికాప్టర్‌లో ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి విచ్చేశారు. అనంతరం తల్లి వైఎస్.విజయమ్మ, చిన్నాన్న వైఎస్.సుధీకర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డితో పాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ఆర్ ఘాట్ వద్దకు చేరుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి ముఖ్యమంత్రి జగన్ ఘనంగా నివాళులర్పించారు. ఘాట్ సమీపంలో ఉన్న వైఎస ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గెస్ట్‌హౌస్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత ఆయన తిరిగి హెలికాప్టర్‌లో కడపకు చేరుకుని ప్రత్యేక విమానంలో తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, శాసనమండలి డిప్యూటి చైర్మన్ జఖియాఖనం, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మేడా మల్లికార్జునరెడ్డి, టి.జె..సుధాకర్ బాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సుధ, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, టిటిడి బోర్డ్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివప్రసాద్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్, సహాయ వ్యక్తిగత కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, ఎస్‌పి అన్బురాజన్, జెసి గణేష్ కుమార్, ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి, పులివెందుల ఆర్‌డిఒ వెంకటేశం, అదనపు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు, అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్ పాల్గొన్నారు.



వైఎస్ఆర్ ఘాట్ వద్ద తండ్రి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ బతికే ఉన్నాడు : షర్మిల

వైఎస్ఆర్ చనిపోయి 14 సంవత్సరాలైన తెలుగు ప్రజల గుండెల్లో ఇప్పటికీ బతికే ఉన్నారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు షర్మిల అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని వైఎస్ఆర్ సమాధి వద్దకు తల్లి విజయమ్మ, చిన్నాన్న సుధీకర్‌రెడ్డితో కలిసి షర్మిల నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికి వైఎస్ఆర్ అమలు చేసిన పథకాలను ప్రజలు మరిచి పోలేదని చెప్పారు. వైఎస్ఆర్ ది మంచి మనస్సు అన్నారు. వైఎస్ఆర్ అమలు చేసిన ప్రతి పథకం ప్రతి ఇంటికీ చేరినట్లు చెప్పారు. సోనియా గాంధీతో కలిసిన విషయంపై విలేకరులు షర్మిలను ప్రశ్నించగా పార్టీ విలీనంపై మాట్లాడడం ఇది సందర్భం కాదని మాటను దాట వేశారు. అనంతరం ఆమె కడప విమానాశ్రయం చేరుకుని విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.



వైఎస్ విగ్రహానికి నివాళుర్పిస్తున్న వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు షర్మిల, విజయమ్మ

15వ ఫైనాన్స్ నిధులకు మోక్షం

- రూ.10.33 కోట్లు విడుదల
- నాలుగు పంచాయతీలకు నో

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు 15వ ఫైనాన్స్ నిధుల విడుదలకు మోక్షం లభించింది. కొన్ని నెలలుగా పంచాయతీ సర్పంచ్‌లు 15వ ఫైనాన్స్ నిధుల విడుదల కోసం నిరసన ప్రదర్శనలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం 15వ ఫైనాన్స్ నిధులను ఇతర కార్యక్రమాలకు మళ్లిస్తోందని, ఫలితంగా తమ పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామనే వాదనతో ఆందోళనలు చేపట్టారు. ఇటు వంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్, పిఎంఎస్ వ్యవస్థల సహాయంతో మొదటి విడత కింద రూ.10.33 కోట్లను రెండ్రోజుల కిందట పంచాయతీ ఖాతాలకు జమ చేసింది. జిల్లాలోని 35 మండలాల పరిధిలోని 557 పంచాయతీల్లో 553 పంచాయతీలకు విడుదల చేసింది. అన్‌టైడ్ కేటగిరీ కింద రూ.68.13 లక్షలు, టైడ్ కేటగిరీలో రూ.95.50 లక్షల చొప్పున విడుదల చేసింది. పంచాయతీల జనాభా ఆధారంగా నిధులను జమచేసినట్లు తెలుస్తోంది. నాలుగు పంచాయతీలను మినహాయించింది. కొండాపురం, పెద్దపల్లి, మాచిరెడ్డిగారిపల్లి, సి.గోపలాపురం పంచాతీయల్లో కొన్నింటికి ఎన్నికలు నిర్వహించని కారణంగా నిధులు జమ చేయలేదు. పంచాయతీలకు నిధులను నేరుగా విడుదల చేయడంతో పంచాయతీలకు సంబంధించిన కరెంటు బకాయిల చెల్లింపుల సమస్య తెరపైకి వచ్చే అవకాశం ఉంది. పంచాయతీ సర్పంచులు, పాలక వర్గాలు పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను, అభివృద్ధి పనులను ఎలా సమన్వయం చేస్తాయోననే అంశం చర్చనీయాంశమైంది.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు జిల్లా వర్క్ షాప్ పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. కులాల, మతాల మధ్య గొడవలు సృష్టించి ఉద్యోగుల సమస్యలు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్ సెక్టార్‌ను తెగ నమ్ముతూ ప్రయివేటీకరణకు పూనుకోవడం అన్యాయమని తెలిపారు. స్కీం వర్కర్లకు రోజురోజుకూ బడ్జెట్ కుదించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాక మునుపు ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఒక మాట మాట్లాడడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.23వేలు ఇచ్చి రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో సిఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్, జిల్లా కోశాధికారి బి. లక్ష్మీదేవి, కార్యదర్శిలు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, సత్యనారాయణ చారి, నాగేంద్ర, ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, అంజలీదేవి, సాల్మన్, రాఘవ, రవి, సురేష్, చంద్రారెడ్డి రిమ్స్ ,అంగన్వాడి, మున్సిపల్ విద్యుత్తు, ఐఎంఎల్, చైతన్య, ఆటో, బిల్డింగ్ రంగాల నాయకులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు

విద్యుత్ భారాలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

-సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు విద్యుత్ ఛార్జీల అదనపు భారం వేస్తూ మరో వైపు విద్యుత్ కోతలు అమలు చేయడం వల్ల సామాన్య ప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్ విమర్శించారు. శనివారం నగరంలోని పాత బస్టాండ్‌లో ఉన్న పూలే సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్యుత్ యూనిట్ ఛార్జీలను పెంచితే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని, రకరకాల పేర్లతో అదనపు భారాన్ని వేస్తున్నారని, దీనిని తక్షణమే నివారించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు అరికట్టాలని, నిరంతరం సరఫరా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. విద్యుత్ రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజానీకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 4 న జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఆందోళనలో ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కామనురు శ్రీనివాసులరెడ్డి, సత్య నారాయణ, చంద్రారెడ్డి, ఓబులేసు, ముంతాజ్, శ్రీనివాసులు, మల్లయ్య పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

అక్రమ బదిలీలు పారదర్శకతలో భాగమా? : యుటిఎఫ్



డిఇఒ కార్యాలయంలో నిరసన తెలియజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించి రెండు నెలలు గడవకముందే తమ అనుమాయులకు, పైరవీకారులకు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అక్రమ బదిలీలు నిర్వహించడం పారదర్శకత పాలనలో భాగమా అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అక్రమ బదిలీలను నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ తమ పాలన పారదర్శకతకు మారుపేరని పదేపదే ప్రకటించుకునే రాష్ట్ర ప్రభుత్వం, కొందరు ఉపాధ్యాయుల పైరవీలకు తలొగ్గి కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ఆర్థిక, రాజకీయ పలుకుబడి కలిగిన తమ అస్మదీయులు, అనుమాయులైన కొందరు ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉత్తర్వులతో దొడ్డి దారిన అక్రమ బదిలీలు నిర్వహించడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సెలింగ్ విధానానికి తూట్లు పొడిచేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న సిఫార్సు బదిలీల వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సాధారణ ఉపాధ్యాయ బదిలీల్లో కేటగిరి 1, 2లలోని కొన్ని స్థానాలను బ్లాక్ వాటిని ఇప్పుడు సిఫార్సు బదిలీల ద్వారా భర్తీ చేయడం సిగ్గుచేటన్నారు. సాధారణ బదిలీలలో మారుమూల ప్రాంతాలలోని ఖాళీలు భర్తీ కాకుండా విద్యార్థులు నష్టపోతారని నీతులు చెప్పిన ప్రభుత్వం, పట్టణ ప్రాంతాల్లోని కేటగిరి 1, 2 ఖాళీలను బ్లాక్ చేసి ఇప్పుడు సిఫార్సు బదిలీలతో భర్తీ చేయడం ద్వారా తన నైజాన్ని బయట పెట్టిందని ఎద్దేవ చేశారు. మాటిమాటికి సిఫార్సు బదిలీల ద్వారా పట్టణ ప్రాంతాలలోని ఖాళీలను భర్తీ చేస్తే మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మారుమూల ప్రాంతాల్లోనే ఉండిపోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. సాధారణ బదిలీలకు ముందు నుంచి అక్రమ బదిలీలను చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ 75 మందికి సిఫార్సు బదిలీలు చేపడుతూ డిఇఒలకు రహస్య ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే సిఫార్సు బదిలీలను రద్దుచేసి తమ పారదర్శకతను, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సిఫార్సు బదిలీలను ఉపసంహరించుకోకపోతే ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, నాయకులు సుబ్బారెడ్డి, గోపీనాథ్, కరీముల్లా, కిరణ్ బాబు, శివశంకర్, జి. వెంకటసుబ్బయ్య, కొండయ్య బాబు, సూర్య కుమార్, అబ్దుల్, గని ప్రకాష్ బాబు, విశ్వనాథ్, సాగర్, జానకి, రామ్, శశిధర్, హమీద్ పాల్గొన్నారు.

సాగు పట్టాల కోసం 4న ధర్నా

ప్రజాశక్తి -పెండ్లిమర్రి

సాగు భూముల పట్టాలు కోసం దళితులు,పేదలతో కలిసి ఈనెల 4న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి. అన్వేష్ పేర్కొన్నారు. శనివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలోనూ, ధరలను అదుపు చేయడంలోనూ ఘోరంగా విఫలమైందని వాపోయారు. బడా పెట్టుబడి దారులకు లక్షల కోట్లు రాయితీలిస్తూ పేదలపై భారాలు మోపుతోందని వాపోయారు. ఉపాధి పనులు సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ప్రజలందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మల్లేష్, ఉత్తయ్య, చెన్నప్ప నిత్య పూజయ్యా, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు కాంగ్రెస్ వ్యతిరేకం : పిసిసి

కడప : నరేంద్ర మోడీ పని ఇక అయిపోయిందని, ఇండియా విజయం తథ్య మని, జమిలి ఎన్నికలకు కాంగ్రెస్ వ్యతిరేకమని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్ అసలైన కాంగ్రెస్ వాది అని, జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి వ్యతిరేకి అని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారారని అన్నారు. ఇటీవల ముంబాయిలో జరిగిన ఇండియా కూటమి సమావేశం విజయవంతం కావడం హర్షనీయం అన్నారు. సాధ్యమైనంత వరకు ఇండియా తరుపున ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టాలని రాష్ట్ర వారీగా సీటు సర్దుబాటుపై సత్వరం చర్యలు చేపట్టాలని, ప్రజా సమస్యలపై ర్యాలీలు నిర్వహించాలని ఇండియా కూటమి నిర్ణయించిందన్నారు. అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలలో కూడా జమిలి ఎన్నికలు లేవన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, సీనియర్ నాయకులు బండి జకరయ్య, సత్తార్, నజీర్ అహ్మద్, చీకటి చార్లెస్, పాలగిరి శివ, శ్యామల, లావణ్య, ప్రసాద్ గౌడ్, తిరుమలేష్, అలీఖాన్, మధు రెడ్డి, మామిళ్ళ బాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డిడియుజికెవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో ఉన్నతి స్కీంలో భాగంగా ఐదు ఏళ్ల లోపల ఉపాధి హామీ పథకంలో వంద దినాలు పూర్తి అయిన కుటుంబాలలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో- ఆర్డినేటర్ ఎన్. సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 4 నెలల కాలవ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కోర్సులలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. అదనంగా బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వంతో గుర్తించబడిన సర్టిఫికెట్, అర్హతను బట్టి ప్రయివేట్ సంస్థలో మంచి జీతంతో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అడ్మిషన్ల కోసం ఆసక్తి కలిగిన వాళ్లు కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో 9063082227 సంప్రదించాలని తెలిపారు.

4న బిటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -కడప అర్బన్

2023-24వ విద్యా సంవత్సరానికి కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరంలో వివిధ బ్రాంచ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 4న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థిని, విద్యార్థులు తమ తల్లితండ్రులతో హాజరు కావాలని తెలిపారు.

కలకలం

ప్రజాదృష్టి

ఇసుకాసురుల బరితెగింపు మరోసారి కలకలం రేపింది. గతంలో కమలాపురం నియోజకవర్గ నేత చేష్టల కారణంగా పోరుమామిళ్లకు చెందిన వైసిపి నాయకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. తాజాగా జమ్మలమడుగు నియోజకవర్గ నాయకుల మధ్య ఆధిపత్య రాజకీయాల్లో భాగంగా అధికార పార్టీకి చెందిన నాయకునిపై దాడి దశ నుంచి ఏకంగా కిడ్నాప్ చేసి గాయపరచడం వంటి ఘటనలతో కలకలం రేపిన సంగతి తెలిసిందే. జిల్లాలోని జమ్మలమడుగు, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు నియోజకవర్గ కేంద్రాలుగా ఇసుకాసురుల చెలరేగిపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడనిదే భూగర్భశోకం తీరదు. ఇసుకాసురుల ఆగడాలన్నింటి వెనుక ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉండడం విస్మయాన్ని కలిగిస్తోంది. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలంలోని ఓ ఇసుక క్వారీ నుంచి మైనింగ్ నిబంధనలను బేఖాతర్ చేస్తూ సుమారు 10 నుంచి 12 మీటర్ల వరకు గుంతలు తవ్వి ఇసుకను కొల్లగొడుతుండడం దోపిడీకి పరాకాష్ట్రగా చెప్పుకోవచ్చు. రాష్ట్రంలో ఎవరు అధికారం చేపట్టినా ప్రకృతి వనరులను చెరపట్టి కొల్లగొట్టి భారీగా సొమ్ము చేసుకునే యజ్ఞం పదేళ్లుగా సాగిపోతోంది. ఇసుక, మట్టి, ఎర్రచందనం, భూకబ్జాలను వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది జిల్లా పరిషత్ కార్యాలయంలో నీటి వనరులపై ఓ కామ్రేడ్ రచించిన పుస్తకావిష్కరణ సభలో ఓ రిటైర్డు జస్టిస్ ఇసుకను కొల్లగొట్టడం వల్ల నీటి వనరుల లభ్యతపై పెనుప్రభావం పడుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మేధావులు, బుద్ధిజీవుల నుంచి హెచ్చరికలు, ఆందోళనలు వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం ఆందోళనకరం. ఆకులు కాలిన తర్వాత చేతులు పట్టుకున్నా ఉపయోగం ఉండదనే హితవు చెవికి ఎక్కడం లేదు. అంతులేని ధన దోపిడీకి కళ్లెం వేయాల్సిన తరుణం ఆసన్నమైందని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలోని మేధావులు, బుద్ధిజీవులు, విద్యావంతుల్లో చలనం రావాల్సిన అవసరం ఉంది. ఉత్తముల మౌనం వల్ల సమాజానికి తీవ్రహాని జరుగుతుందనే అంశాన్ని గ్రహించాల్సిన అవసరం ఏర్పడింది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకుల దోపిడీకి హద్దు పద్దూ లేకుండా పోతుంది. జిల్లాలోని అధికార పార్టీకి చెందిన చట్టాలు చేసే ప్రజాప్రతినిధులు, అనుచరుల రూపంలో ఉండడం వల్ల జిల్లాకు చెందిన అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వమే ప్రకృతి వనరులకు వాటిల్లుతున్న హానిపై స్పందించాల్సిన అవసరం ఉరుముతోంది.

– ప్రజాశక్తి - కడప ప్రతినిధి


నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కడప సిటీ

నగరంలోని 19, 21వ డివిజన్ పరిధిలోని హంసింగ్ బోర్డు కాలనీలో 21 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేశామని కార్పొరేటర్ వెలిగండ్ల శిరీషా తెలిపారు. శనివారం ఉదయం ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను ఆలకించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా అవ్వాతాతల దగ్గరికి వెళ్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫథకాలను గ్రౌండ్ లెవల్ కు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత వేగవంతం చేస్తామన్నారు. అవ్వాతాతల పింఛన్ల దగ్గరి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి పిలుపును ఉద్యమ రీతిలో ముందుకు తీసుకెళ్తామన్నారు. అర్హత కలిగి ఉండి పథకాలకు దూరంగా వారిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నిజమైన అర్హులెవరైనా ఉంటే తమను సంప్రదించాలన్నారు. ఆమె వెంట డివిజన్ ఇన్‌ఛార్జులు వెలిగండ్ల లక్ష్మయ్య, మోతుకూరి సుబ్బారాయుడు, కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఈటె రామచంద్రయ్య



19, 21 డివిజన్‌లలో నూతన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

కడప : ఇటీవల మంజూరైన నూతన వృద్ధాప్య, వితంతు పింఛన్లను శనివారం 22వ డివిజన్‌లోని మారుతినగర్‌లో డివిజన్ వైసిపి ఇన్‌ఛార్జి ఈటె రామచంద్రయ్య పంపిణీ చేశారు. అర్హులైన వారందరికీ వైసిపి ప్రభుత్వంలో పింఛన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పింఛనుదారులు రామచంద్రయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

టిడిపితోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపితోనే మహిళలకు, రైతులకు, యువతకు న్యాయం జరుగుతూ ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మస్తాన్ గోలే, కరిముల్లా, కుళాయిరెడ్డి, సురసుర శ్రీనివాసులు, పెన్నానగర్ మజీద్ మెరువ మూర్తి, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

రేపు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ నెల 4న జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక పాత బస్టాండ్ సిపిఎం జెండా స్థూపం వద్ద శనివారం సమరభేరి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న హామీ ప్రకారం కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో కరెంటు ఛార్జీల పెంపు కొద్ది నెలలుగా ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్యాస్ ధరను రూ.450 నుండి రూ.1,150 పెంచి రెండు వందల రూపాయలు తగ్గించి గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల స్టంట్‌గా ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. సిలిండర్ రూ.500కు ఇచ్చేలా నిర్ణయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పట్టణంలో అనేకం పేరుకుపోయి ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయాలన్నారు. వీటి పరిష్కారం కోసం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అబ్రహం, నన్నే, మోషా, భీమా పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను మరో అవార్డు వరించింది. గత జనవరి నెల 18న జాతీయస్థాయిలో అహ్మదాబాద్‌లో జరిగిన బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ అవార్డులు సాధించిన కుమారి షేక్ అసిఫా, షేక్ హఫ్సా అస్రాను మరో విశిష్ట అవార్డు వరించింది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ సొసైటీ డాక్టర్ కె.వి.రావు సైంటిఫిక్ సొసైటీ వారు నిర్వహించిన వార్షిక సైన్స్ అవార్డు ఫంక్షన్‌లో భాగంగా ఎన్‌సిఎస్‌సిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. ఇందులో పాల్గొన్న రాష్ట్రస్థాయిలోని ప్రైవేటు పాఠశాలలో ప్రథమ స్థానం పొందారు. ప్రశంసాపత్రంతోపాటు అలాగే వారి ఉన్నత విద్య పూర్తి అయ్యే వరకు ప్రతి సంవత్సరం రూ.5వేలు ఉపకార వేతనం అందజేస్తామని తెలిపారు. విద్యార్థులతోపాటు వీరికి శిక్షణను ఇచ్చిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పాఠశాల సైన్స్ టీచర్ ఎన్.ప్రశాంత్‌ను సన్మానించారు. డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ బి.రవీంద్ర విద్యార్థులను అభినందించారు.

వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌కు ఎసి వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌కు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప ఎసి వితరణ చేశారు. ముఖ్యఅతిథులుగా తొండూరు మండల వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మదన్‌మోహన్‌రెడ్డి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, సురేంద్ర, రవీంద్ర, సభ్యులకు అందజేశారు. అనంతరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తమ్ రెడ్డి బీరువాను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న విలేకరులు ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ముందుగా మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులను వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాత్రికేయులు చిక్కని హరికుమార్, పఠాన్, విమన్, నరసింహులు, రాము, కౌన్సిలర్ కిషోర్, వైసిపి నాయకులు, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర వాల్మీకి సంఘం డైరెక్టర్ అంబకపల్లి నారాయణస్వామి, వెంకటసుబ్బయ్య, బాలయ్య, కోళ్ల భాస్కర్, దాసరి చంద్రమౌళి, సిద్దయ్య, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీల ప్రసాద్, వీరయ్య పాల్గొన్నారు.

7న ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఈనెల 7న పలు కార్యక్రమాలు ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో 7న సాయంత్రం హరినామ సంకీర్తనలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇటీవల భాగవతంపై నిర్వహించిన పరీక్షల్లో విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. భగవద్గీత అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

రక్తదానం.. వేరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రక్తదానం వేరొకరికి ప్రాణదానమని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. జనసేన అధినేత, ప్రముఖ సినీ హీరో పవర్ స్టార్ పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కోర్టు ఎదురుగా జనసేన జమ్మలమడుగు నాయకులు అల్లం సూర్య నారాయణ, నల్లంశెట్టి నాగార్జున ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 వసంతాల సినీ జీవితంలో 28 సినిమాలలో మాత్రమే నటించి తెలుగు రాష్ట్రాలలో తనకంటూ ఒక ప్రత్యేకత చాటుకున్న ఏకైక హీరో పవన కళ్యాణ్ అన్నారు. సామాజిక స్పృహ కలిగిన పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి జనసేనానిగా అభిమానుల గుండెల్లోనే కాక ప్రముఖుల విమర్శకుల చేత సైతం కొనియాడబడుతున్న నాయకుడన్నారు. రక్తదాన శిబిరంలో అభిమానులు, నాయకులు 100 మంది రక్తదానం చేసినట్లు వారు తెలిపారు. ముందుగా జమ్మలమడుగు అధికారి ప్రతినిధి వివేక్ బాబు ప్రసంగించారు. భూపేష్‌రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. చివరగా 500 క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగదీష్, వనం గురుకుమార్, హరి రాయల్, పవన్ రాయల్, కాటం రాయుడు, వినయ్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో జనసేన నాయకులు

క్రైం కార్నర్

కారును ఢీకొన్న టిప్పర్

అత్త, అల్లుడు దుర్మరణం, కూతురికి గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు–తాడిపత్రి ప్రధాన రహదారిలోని ఓబుళాపురం గ్రామం సమీపం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అత్త, అల్లుడు మృతి చెందగా, కూతురికి గాయాలయ్యాయి. సిఐ నరేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణానికి చెందిన నాగిరెడ్డిగారి లక్ష్మీదేవి, నొస్సం చెన్నకేశవరెడ్డి, అనురాధ కారులో కడపకు వివాహానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తాడిపత్రి వస్తుండగా ఓబుళాపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కారును కొంది. ఈ ప్రమాదంలో అత్త నాగిరెడ్డిగారి లక్ష్మీదేవి (70) డ్రైవింగ్ చేస్తున్న పెద్ద అల్లుడు నొస్సం చెన్నకేశవరెడ్డి (55) మృతి చెందారు. రెండవ కూతురు అనురాధకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడు చెన్నకేశవరెడ్డి అనంతపురం జిల్లాలోని లేపాక్షి మండలంలో ఎఎస్ఒగా విధులు నిర్వహిస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాలను, గాయపడిన అనురాధను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



కారులోనే మృతి చెందిన అత్త, అల్లుడు

తీవ్ర వర్షాభావంతో వాడుతున్న పంటలు

పెట్టుబడులపై ప్రభావం - దిక్కుతోచని స్థితిలో రైతులు



గురజాలలో వాడుదశకు చేరుకున్న వేరుశనగ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

తీవ్ర వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు వాడుతగులుతున్నాయి. బెట్టకు ఎండు దశకు చేరుకున్నాయి. మండలంలో ప్రధానంగా వేరుశనగ, పత్తి, మినుము, ఆముదం ఇతర పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వేరుశనగ 169 ఎకరాలు, ఆముదం 302, పత్తి 82, ఇతర పంటలు దాదాపు 150 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఇ క్రాప్ విధానంలో నమోదు చేశారు. ఇంకా నమోదు కాని పంటలు దాదాపు 200 ఎకరాలు పైగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జూన్ నెలలో అరకొరగా వర్షం నమోదు కావడంతో రైతులు పంటలను సాగు చేశారు. జులై నెలలో సాధారణ వర్షపాతం 101 మిల్లీమీటర్లు కురవాల్సి ఉంది. ఆగస్టు నెలలో107 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఈ రెండు నెలల్లో వర్షం ఏమాత్రం పడకపోవడంతో పంటలు ఎండు దశకు చేరుకున్నాయి. ఆరుగాలం శ్రమించి పంటను సాగు చేసిన రైతుకు వరుణదేవుడు కరుణించకపోవడంతో వారు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చులు సైతం పెరిగాయి. ఈ తరుణంలో వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడను న్నారు. మరి కొంత మంది రైతులు పొలాలను దుక్కులు చేసి సాగుకు సిద్ధంగా ఉన్నప్పటికీ సరైన సమయంలో వర్షం కురవకపోవడంతో సాగుకు నోచుకోలేదు.

ప్రభుత్వం ఆదుకోవాలి



తీవ్ర వర్షాభావంతో సాగుచేసిన వేరుశనగ పంట వాడ దశకు చేరుకుంది. దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎకరాకు రూ.20,000 చొప్పున పరిహారం ఇవ్వాలి.

- ద్వారకనాథ్ రెడ్డి, వేరుశనగ రైతు, గురజాల

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

జులై, ఆగస్టు నెలలో తీవ్ర వర్షాభావంతో సాగు చేసిన పంటలు వాడుతున్నాయి. సాగు చేసిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం.

- శివనాథ్‌రెడ్డి, ఎఒ, సింహాద్రిపురం

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు



మైదుకూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి


ప్రజాశక్తి - చాపాడు

మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు లింగన్న, లక్ష్మమయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **చాపాడులో** వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతపురం గ్రామంలో సివి సుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అన్నవరం గ్రామంలో రామ్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **జమ్మలమడుగు :** ప్రజల ఆశాజ్యోతి మరపురాని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం స్థానిక సాయిరాం థియేటర్ వద్ద గల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో స్వాతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ముల్లా జానీ, హస్త కళల చైర్‌పర్సన్ బడిగింజల విజయలక్ష్మి, కౌన్సిలర్లు పోచిరెడ్డి, గౌరీనాథ్, శామీర్, డైరెక్టర్ మార్బుల్ శీను, వైసిపి నాయకులు కేకే రమణారెడ్డి, బడిగింజల చంద్రమౌళి, షామిర్ అలీ, కిరణ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** మండలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.. మార్కెట్ యార్డ్ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సింహాద్రిపురం, కుమ్మరం పల్లె కాలనీలలోని వైఎస్ విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు జాఫర్, వైసిపి నాయకులు బిఎన్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ ఖాదర్ వలి, మల్లికార్జున్‌రెడ్డి, సోమల చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. **ముద్దనూరు :** దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సందర్భంగా శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో, వైసిపి కార్యాలయంలో నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వరదారెడ్డి, నియోజకవర్గ వైసిపి యువనేత డాక్టర్ నవజ్యోత్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ముద్దనూరు ఉప సర్పంచు రామాంజనేయరెడ్డి, మౌనిక మిల్క్ డెయిరీ ఎండి శ్రీనివాసులు, కాపునాడు జిల్లా అధ్యక్షులు రవికుమార్, నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, పుల్లయ్య యాదవ్, సర్పంచులు సుధాకర్, భాస్కర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఖదీర్ బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అసలైన కాంగ్రెస్ వాది కాగా, సిఎం జగన్‌రెడ్డి కాంగ్రెసుకు పూర్తి వ్యతిరేకమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, ఉత్తన్న, రవి, శివ, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, సాయి, ఆరుశేర్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ప్రతి గుండెలో నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి అన్నారు. శనివారం వైఎస్ వర్ధంతి పురస్కరించుకొని పట్టణంలోని పాత ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వాల్మీకి సంఘ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, వైస్ హఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిషోర్, లక్ష్మీ భార్గవి, రాము, రంగనాయకులు, నాయకులు వెంకటసుబ్బయ్య, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, రవి, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రసాద్, రంగనాయకుల గుడి దేవస్థానం చైర్మన్ సుధీకర్‌రెడ్డి, సోపాల వీర, పెద్ద వీరయ్య, కృష్ణమూర్తి, సూరి, బలిజ సంఘ అధ్యక్షుడు ప్రసాద్, రసూల్, గంగిరెడ్డి, కోళ్ల భాస్కర్, షమీవుల్లా, చంద్రమౌళి, నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బి. కోడూరు :** మండలంలో డాక్టర్ వైఎస్ఆర్ 14వ వర్ధంతి వేడుకలు వైసిపి నాయకులు నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు. జడ్‌పిటిసి దావీదు, సుబ్బారెడ్డి. మండల సొసైటీ ప్రెసిడెంట్ ఓ. ప్రభాకర్ రెడ్డి, అభిమానులు పాల్గొన్నారు. **కడప :** నగరంలో పేదలకు అన్నదాన కార్యక్రమం, దుప్పట్ల పంపిణీ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కార్యక్రమం నిర్వహించారు. కడప నగరంలోని అప్సర సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష, జడ్‌పి చైర్మన్ అమర్ నాథరెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులరెడ్డి, మేయర్ సురేష్‌బాబు కలిసి హెడ్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ లోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైసిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. **పోరుమామిళ్ల టౌన్ :** పట్టణంలో వైఎస్ఆర్ విగ్రహానికి బద్వేల్ ఎమ్మెల్సీ డి.సి గోవిందరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి. పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబులాపురంలోని వివేకానంద వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్ పండ్లు పంపిణీ చేశారు. **ప్రొద్దుటూరు :** తన తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనను మరిపించలా పాలన అందిస్తానని హామీలిచ్చి అందుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల నజీర్ విమర్శించారు. వైయస్ వర్ధంతి సందర్భంలో శనివారం మున్సిపల్ కార్యాలయంలోని వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉదూద్ ఖాన్, సైమన్, భాస్కర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.



పులివెందులలో వైఎస్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు

కృత్రిమ మేధస్సుతో సవాళ్లకు పరిష్కారం



మాట్లాడుతున్న కెసి రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో సమాజంలో మానవాళి ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను పరిష్కరించవచ్చునని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెసి రెడ్డి తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ ఆర్‌కెవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లోని కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శనివారం కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోణం ఫెలోషిప్ కార్యక్రమాన్ని కెసి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జెయుకెటి యూనివర్సిటీలో చదివిన పూర్వ విద్యార్థి సందీప్ కోణం అనే వాటిని స్థాపించడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి కూడా తమ అమూల్యమైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని సందీప్ కోణంను ఆదర్శంగా తీసుకొని దేశం గర్వించేస్థాయిలో నిలవాలని కోరారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన భారతదేశం ఎన్నో విజయాలను సాధిస్తోందన్నారు. గవర్నింగ్ కౌన్సిలర్ ప్రొఫెసర్ విజయకుమార్ మాట్లాడుతూ కోణం ఫౌండేషన్ ఫెలోషిప్ కార్యక్రమాలను దశలవారీగా అన్ని ఆర్‌జెయుకెటి కళాశాలలకు విస్తరించాలని కోరారు. కోణం ఫెలోషిప్ అత్యంత ప్రతిష్టాత్మకమైనదని చెప్పారు. కోణం ఫౌండేషన్ చైర్మన్ సందీప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రతిభకు మెరుగులుదిద్ది ఉన్నత శిఖరాల వైపునకు వారు ప్రయాణించేలా చేయాలనే సంకల్పంతో తొలిసారిగా తమ సంస్థ ఫెలోషిప్‌ను తాను చదువుకున్న ఆర్‌కెవ్యాలీ యూనివర్సిటీలో ప్రారంభించినట్లు వెల్లడించారు. నిత్యం ఎదుర్కొనే అనేక సవాళ్లకు పరిష్కారం చూపడమే తమ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొలువులను దక్కించుకునేందుకు కూడా తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ సంధ్యారాణి, కోణం ఫౌండేషన్ సమన్వయకర్త మహ్మద్ రఫీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాంభూపాల్‌రెడ్డి, సమరసింహారెడ్డి, అనురాధ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలపై శిక్షణ

పులివెందుల టౌన్ : భవన నిర్మాణాలపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం జెఎన్‌టియు కళాశాలలో నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు భవన నిర్మాణ డిజైన్ ఎలా రూపొందించాలనే విషయాన్ని సివిల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు మనీషా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఉద్యోగ సామర్థ్యం పెరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వసుంధర పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ డిపార్ట్‌మెంట్ ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ బి.దిలీప్‌కుమార్‌రెడ్డి, సివిల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

బియ్యం, ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని దీనబంధు మానసిక విభిన్నప్రతిభావంతుల ఆశ్రమం ట్రస్టుకు పులివెందుల ఎస్ఎంఎస్ అసిస్టెంట్ చీఫ్ సెక్యూరిటీ, రిటైర్డ్ డిఎస్‌పి ఖలీల్ సౌదాగర్ శనివారం ట్రస్ట్ జనార్ధన రెడ్డికి మూడు బస్తాలు బియ్యం, మూడు సీలింగ్ ఫ్యాన్లు, ఒక టేబుల్ ఫ్యాన్ నగిరిగుట్టలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక విభిన్న ప్రతిభావంతులకు తను సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి వారి కోసం తమ కంపెనీ తరపున ఈ సాయాన్ని అందించామన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ వారికి వారి కుటుంబ సభ్యులకు తమ దీనబంధు మానసిక విభిన్నప్రతిభావంతుల ఆశ్రమం ట్రస్టు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండారెడ్డి పాల్గొన్నారు.



బియ్యం, ఫ్యాన్లు అందిస్తున్న రిటైర్డ్ డిఎస్‌పి ఖలీల్ సౌదాగర్

గండి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మూడవ శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున నుంచి ఆంజనేయ స్వామి మూల విరాట్‌కు పూల అలంకరణతో ప్రధాన అర్చకులు కేసరి స్వామి రాజ స్వాములు భక్తులను అలరించేలా అలంకరణ చేశారు. ఈ ఏడాది ఎండ తీవ్రతంగా ఉన్నప్పటికీ అటు వేంపల్లి వైపు నుండి ఇటు అద్దాలమర్రి క్రాస్ నుండి భక్తులు కాలినడకతో అంజన్న దర్శనం కోసం గంటల తరబడి బార్లు తీరారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని భక్తులకు సౌకర్యం కోసం వేంపల్లి ప్రైవేటు స్కూలు వాహనాలు ఉచితంగా ఇరువైపులా భక్తులను గండి క్షేత్రానికి తరలించారు. పేరుకు సర్వదర్శనం బోర్డు పెట్టడం, ఆదాయమే పరమావధిగా ఆలయాల నియమాలకు అధికారులు తిలోద కాలిచ్చారనే ఆరోపణలు వచ్చాయి. రూ.10 లేనిదే దైవదర్శనం లేదనడం ఏంటని హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు సుజన్‌కుమార్ విమర్శించారు. శ్రావణమాసం ప్రారంభం ముందే దేవస్థాన అధికారులకు ఉచిత దర్శనం పెట్టాలని వినత పత్రం ఇచ్చామని ఆయన తెలిపారు.



అంజన్న దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

గండి అంజన్న సన్నిధిలో కమలాపురం ఎమ్మెల్యే

గండి శ్రావణ మాసోత్సవాలు పునస్కరించుకొని శనివారం కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన కార్య నిర్వహణ అధికారి అలవలపాటి ముకుందారెడ్డి, దేవస్థాన చైర్మన్ పిన్నుబోలు రాఘవేంద్ర ప్రసాద్ ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు చేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మునిసిపాలిటీ పరిధిలోని 4వ వార్డు సచివాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథులుగా ఆ వార్డు కౌన్సిలర్ కిషోర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 20 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్,ర వైసిపి నాయకులు సిద్దయ్య, మునీంద్రా, హరి, నాగరాజు, సచివాలయ కన్వీనర్లు నవీన్, బాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డర్‌కు 'కొనిరెడ్డి' అభినందనలు

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక గాంధీ రోడ్‌లో ఉన్న యు అండ్ ఐ ఫిట్నెస్ జిమ్ సెంటర్‌లో మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగిన ఇండియా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ బాడీ బిల్డింగ్ పోటీలో టైటిల్ గెలిచిన స్థానిక రాజారెడ్డిని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి సన్మానించారు. అనంతరం కొనిరెడ్డిని మన ప్రజా సేవా సమితి సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బాడీ బిల్డర్ మిస్టర్ ఇండియా స్వర్ణ పతకం కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. కొనిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో తేదీని ఖరారు చేసి ప్రకటిస్తామన్నారు. మన ప్రజా సేవా సమితి, యు అండ్ ఐ జిమ్ ఫిట్నెస్ సెంటర్‌ను కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ప్రొద్దుటూరులో బాడీ బిల్డర్ పోటీలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హర్షవర్ధన్‌రెడ్డి, మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి ఆయూబ్ ఖాన్, యు అండ్ ఐ మాస్టర్ రాజారెడ్డి, హరి యాదవ్, అర్షద్, గోపాల్, సింగ్, నరసింహ, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.